# అనౌచిత్యపు పెళ్ళి

**ఆ వీధిలో నాలుగో ఇల్లు జనంతో కిటకిటలాడి పోతోంది.**

**ఆ ఇంటి యజమాని కట్టుకున్న పెళ్లాన్నీ, కన్న పిల్లల్నీ... ఇల్లూ, వాకిలీ... అంతెందుకు, మనిషి, మమతా అన్నిటినీ విడిచేసీ శలవంటూ ఈ లోకాన్ని వదిలి అప్పడే పదకొండు రోజులయ్యింది.**

**వచ్చే పోయే వారి పరామర్శలతో ఆ ఇంటి ఇల్లాలి కంట తడి ఆరట్లేదు.**

'' అయ్యో! నీ కెలాంటి పరిస్థితి వచ్చిందే. పండంటి సంసారమ్మీద ఏ నరుడి దృష్టి వాలిందో నీ బ్రతుకు బుగ్గిపాలైపోయింది. ఇహ ఈ సంసార సముద్రాన్ని నువ్వొక్కదానవే ఈదుకు రావాలే అమ్మా...! అయ్యో నా వెర్రితల్లీ... తలచుకుంటే గుండె బేజారెత్తిపోతోందే అమ్మా....'

మరో స్వరం 'ఆ కొడుకుని చూసుకు ధైర్యం తెచ్చుకో. ఇహ వాడే ఈ ఇంటి క్కాబోయే మగదిక్కు. నలుగురికీ తల్లో నాలుకలా ఉండి అందరినీ మంచి చేసుకుని నీ కొడుకుని చదివించుకో'. అయితే ఈ స్వరం ఉద్దేశించిన సదరు మగదిక్కు ఒంటిని చిన్న కట్‌డ్రాయర్ తో మిగిలిన చుట్టాల పిల్లలతో జేరి దొడ్లో అలంగం తిరిగేస్తున్నాడు. అదేమీ పట్టని ఈ స్వరమే కొంత స్థాయిని తగ్గించి 'అయినా మీ బావగార్లిద్దరూ మంచి పలుకుబడి గల వాళ్లని విన్నాను. మీ తోడికోడళ్లతో కలుపుగోలుగా ఉంటివా, మీ బావగార్లే నీ కొడుక్కి మంచిఉద్యోగం వేయిస్తారు' అంతటితో ఆగకుండా '' ఇహనేం... చెల్లెలి పెల్లి ఝుమ్మంటూ వాడే చేసేస్తాడు అంత దుఃఖంలోనూ పెల్లి పేరు ఉచ్చరించ గానే ఆ కంఠంలో సంతోషపు ఛాయలు విరగబడుతున్నాయి.

సదరు పెల్లి కూతురు ఒంటిన నూలుపోగైనా లేకుండా నేల మీదబడి పొర్లుతోంది. పాలు తాగనని మొరాయిస్తూ.

అంతలో—

మరో స్వరం రంగంలోకి వచ్చి అంటుంది గదా — ' అయ్యో... ఎంత పనైపోయిందే వర్ధనమ్మ తల్లీ... పట్టుమనీ ముప్పయ్యెన్నా నిండకుండానే నీ పసుపు కుంకుమలు తుడిచి పెట్టుకు పోయాయే... బొట్టులేని నీ పచ్చని నుదురు చూస్తూంటే మనసు ముక్కలై పోతోందే అమ్మా...' అలా దుఃఖంతో బొంగురుపోయిన ఆ గొంతే '' తెల్లారితే ధైర్యంగా నలుగురు కంటాబడి నడిచే యోగం పోయిందే తల్లీ నీకూ... ఇహ ముందున్న దంతా దొంగ బ్రతుకేనా తల్లీ ఎవరి కంటా పడకుండా మూల కూర్చోవాలే అమ్మా.. రోజులెలా వెళ్ల దీస్తావో ఏమో.. పిల్లలా చూడబోతే పదేళ్ళు కూడా లేని పసి వెధవలు. వీళ్ల చదువులూ... పెల్లిళ్లూ.. కార్యం కమామీషంతా ఇంకా ముందరే ఉందేవ్. ఒంటి రెక్కమీద ఎలా నెట్టుకొస్తావో ఏమో.. తలచుకున్నప్పుడల్లా గుండె మోకాళ్లల్లోకి జారుతున్నట్టుగా ఉంటోందేవ్...'

కళ్ల ఒత్తుకుంటూ, బర్రున ముక్కు చీదేస్తూ వెక్కిళ్లు పెడుతూనే ఉన్నారు ఆడంగులు.

ఆ వెక్కిళ్లలో నటనకి ఎంతమాత్రం తావు లేదు.

అయితే మాత్రం....

కొద్ది పాటి మార్పులుచేర్పులతో ఇంచుమించుగా గత పదకొండు రోజుల బట్టీ ఇలాంటి పరామర్శలే వినీ వినీ.. చెవులు గింగిర్లెత్తి పోతున్నాయ్ సరళకి.

వదినగారి పరిస్థితిలో ఏవన్నా మార్పొచ్చిందా అంటే ఓదారుస్తున్న కొద్దీ తగ్గుముఖం పట్టాల్సిన దుఃఖం కాస్తా ఉవ్వెత్తున ఎగిసి పడి దాంతో అప్పుడప్పుడే చిక్కబట్టుకుంటున్న ధైర్యం కాస్తా ముక్కచెక్కలై పోతోంది ఆవిడలో.

ఏడిచి ఏడిచి ఇక సత్తువ లేక ఒంటింటి గుమ్మానికి జారగిల పడిపోతున్న వదిన గారిని చూడగానే సర్రున కోపం దూసుకు రాగా మళ్లీ నోరు తెరువబోతున్న ఆడంగుల కేసి తీక్షణంగా చూసింది సరళ.


వదిన భుజంచుట్టూ చెయ్యివేసి ' మీ పరామర్శలు చాలుగానీ, నిశ్శబ్దంగా ఉంటారా? దయచేసి మీ మాటలతో ఆవిడని అధైర్య పరచకండి ' కసిరినట్టుగా ఉన్న ఆ మాటలకి అంతా విస్తుపోయినట్టుగా సరళ వేపు చూశారు.

అదేం పట్టించుకోని సరళ ' వదినా వదినా....' అని పిలిచింది.

అందుకు వూ అని బదులిచ్చిన వదిన గారి తల నిమురుతూ 'నువ్వింక ధైర్యం తెచ్చుకోవాలమ్మా వదినా. నువ్వలా గుండెలవిసిపోయేట్టు ఏడుస్తుంటే పసి పిల్లలిద్దరూ చూడు ఎలా బెంబేలెత్తి పోతున్నారో?

మేం ఎంత చూసినా, చేసినా తల్లివి... నీకు సాటిరాంగదా.. వేళకి సరిపడా తిళ్లు తినక పిల్లలిద్దరూ చిక్కిశల్యమై పోయారు.

తండ్రి ఎటూ లేనే లేడు. నువ్వుండీ లేనట్టుగా చేస్తే ఎలా?' ఉండేలుదెబ్బతిన్న లేడిలా చూసింది వర్దని ఆ మాటలకి.



అందుకు ఓదార్పుగా చూస్తూ '' ఓర్చుకోవాలి వదినా.

ఓర్చుకు తీరాలి. ఇహ నుంచీ నీ బాధని ఒంటరిగా, నీ నవ్వుని మాత్రం నీ పిల్లలతోనూ పంచుకో.. తప్పదు. గుండెరాయి చేసుకోవాలి. ఇహ నువ్వు లేచి పిల్లల విషయం పట్టించుకోవాలి. దీపాల్లాంటి పిల్లలు వదినా నీకు. వాళ్లలో అన్నయ్యాని చూసుకో. ఆయన పోయి పట్టుమని పది పన్నెండు రోజులయినా కాలేదు... అప్పుడే లేచి పిల్లల్ని చూసుకొమ్మంటుందేమిటో అని అనుకోకు. నువ్వెంత బాధపడినా జరిగిన దాన్ని తిరగదోడలేం

గదా...! బాధపడిన కొద్దీ మనిషివి కృంగి పోవడం తప్ప ఏముంది చెప్పు. మనసుని పిల్లల వైపు మళ్లించుకో.' అని పాతికేళ్లయినా లేని సరళ ఆరిందలా ఒదినగారికి ధైర్యం చెప్పి ఒరే వాసూ... చెల్లాయిని తీసుకు రమ్మంటోందిరా మీ అమ్మ...' అని పిలుస్తూ... గదిలో ఓ మూల గోడకి జార్లగిలబడి ఏడుస్తున్న తల్లికేసి బిక్క మోహ లేసుకు చూస్తున్న ఏడేళ్ల వాసుని మూడేళ్లయినాలేని చంటిదాన్ని తీసుకొచ్చి ఒదినగారి ముందు కుదేసింది.

అంతవరకూ వంటింటి గడపకి ఆనుకుని కూర్చున్నదల్లా పిల్లల్ని దగ్గరగా చూడగానే ముందుకు జరిగి వాళ్లిద్దరినీ పొదవి పట్టుకుని కుళ్లి కుళ్లి ఏడ్చింది. కొంత సేపు ఆవిడనాస్థితిలోనే వదిలేసింది సరళ. అంతా నిశ్శబ్దంగా ఉండి పోయారు.



తల్లి ఎందుకేడుస్తోందో తెలీక పిల్లలు కూడా బేరుమన్నారు.

ఆ ఉధృతం తగ్గిన తరువాత వంటింట్లోకి వెళ్లి ఓ కంచంలో పెరుగూ అన్నం కలుపు కొచ్చి పిల్లలకి పెట్ట మని వదిన గారి చేతికిచ్చింది కంచాన్ని సరళ.

'పుట్టెడు దుఃఖంలో ఉంది. అదేం పెడుతుందిలే అమ్మా' అని వారించబోతున్న వారిని విసుగ్గా చూసి ఊరు కొమ్మన్నట్టుగా సైగ చేసింది.

అప్పటికే పిల్లలిద్దరూ తల్లి ఒళ్ళో చేరి పోయారు. వారి ఒళ్ళు నిమురుతూ ఒక్కో ముద్ద నోట్లో పెడుతోంది వర్ధని. తినకపోతే బతిమాలి బామాలి పెడుతోంది. పిల్లాడు తన కడుపుకి కావాల్సినంతా బుద్ధిగా తినే శాడు గానీ పిల్లది మాత్రం దొడ్డంతా తిప్పించడం మొదలెట్టింది. విసుక్కోకుండా 'తినమ్మా' అంటూ దానివెనకాలే తిరుగుతున్న వదిన గారిని చూసి మనుషుల్లో పడుతోంది. హమ్మయ్య అని నిట్టూర్చింది సరళ.

## రమా నరసింహం కాశీవఝ్ఝుల

అయినా వాడికి మాత్రం ఎన్నేళ్లని... అల్పాయుష్కుడై వెళ్లిపోయాడు. ఈ భూమ్మీద ఇంత మంది కున్న చోటు వాడొక్కడికీ లేక పోయింది. అన్నగారి తలపుతో కళ్ళు నీటి కుండ లయ్యాయి సరళకి.

''జాతస్య మరణం ధృవం' అని తెలిసినా ఈ ఆప్యాయతలూ అనురాగాలు శాశ్వతమనే నమ్ము తుంది పిచ్చిమనసు.

అందుకే ఎప్పటికప్పుడు 'మృత్యువు' ఓ ప్రశ్నార్థకంలా నిలిచిపోతూనే ఉంటుంది మానవ మేధకి. రెప్పపాటు వ్యవధానం కూడాలేని జనన మరణాలు రెండూ రెండు విభిన్నమైన ప్రకృతులే. జోడు గుర్రాల్లా రెండూ ఒక దాన్నొకటి అంటిపెట్టుకునే ఉంటాయి. జననాన్ని చూసి ఇదంతా నా ప్రయోజకత్వమే అని విర్రవీగే మనిషి మృత్యువుని చూసి నెర్రెత్తిపోతాడు. భీతావహుడై బెంబేలెత్తిపోయి దుర్భరమైన విషాదంలో నిలువునా కూరుకుపోతాడు. చనిపోయిన వ్యక్తి తాలూకు జ్ఞాపకాలు గుండె నిండా పరచుకోగా నిలవరించలేక భోరుమంటాడు. ఎవరన్నా భుజం తట్టి ఓదార్చే వరకూ అదే స్థితి.

అనకమాత్రం ''మృత్యువు... ఓహ్... ఒట్టి అగమ్యగోచరం'' అని వెర్రిగా వాపోయినా భవిష్యత్ వైపుకు దృష్టి మళ్ళించక తప్పదు. ఇలా రకరకాలుగా ఆలోచిస్తూ కూర్చున్న సరళ ''ఇప్పుడు వదిన చెయ్యాల్సింది కూడా అదే'' అంది భర్తతో.

రాత్రి భోజనాలయ్యాక మడతమంచం వేసింది భర్తకోసం. ఎంతకీ నిద్రపట్టక అతనితో ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ కూర్చుంది. అదిగో అప్పుడే అంది ''వదినకి ఓదార్పు కావాలంటూ''.

''మరైతే ఇందాకా ఓదారుస్తున్న అల్ల ఆడవాళ్లనెందుకు కోప్పడ్డావ్?'' అని అడిగాడు ఉండబట్ట లేక.

భర్త అలా ప్రశ్నించగానే ఇందాకటి మాటలన్నీ గుర్తొచ్చాయో ఏమో సరళలో మళ్లీ కోపం రాజుకుంది.

''అన్నీ తెలిసీ అలా అడిగితే నేనేం చెప్పను? అవేం ఓదార్పులండీ బాబూ... అని వింటూంటే నాకే భయంతో గుండెలదిరిపోయాయి. ఇక వదిన బెంబేలెత్తిపోయిందంటే అవదూ మరి...?

ఆ బొట్టూ, గాజుల ఊసు ఆవిడకెందుకంట. చూడ్డానికి వచ్చినవాళ్లు చూసిపోవాలి. అవసరపు మాటలెందుకు చెప్పండి? ఈ కాలపుదన్న మాటే గానీ అసలే వదినవన్నీ మాసి ముత్తైదువ నమ్మకాలే. అలాంటప్పుడు ఆవిడ చిన్నబుచ్చుకునే విషయాలని ఎందుకు ప్రస్తావించడం?

''మీరు విన్నారో లేదోగానీ... తోటి కోడళ్లని మంచి చేసుకోవాలట ఆవిడగారు సలహా ఇస్తోంది. అన్నయ్య పోయాడు కాబట్టి ఇహ ఆవిడ వాళ్లా, వీళ్లా దయాధర్మాల మీద బ్రతుకు వెళ్లదీయాలా... అవేం సలహాలండీ బాబూ... అయినా వదిన నోరు తెరచి అడగందే అన్నయ్యలు సాయం చెయ్యరావేం? అందుకోసం నటించాలా? ఆవిడకేం ఖర్మ? ఓదార్పడమంటే ఇలాగుటండీ...?''

ఓదార్పు మనిషికి లేని ధైర్యాన్ని తెప్పించగలగాలి. అంతేకాని ఇకముందు జీవితమంతా ఎదుటివాళ్ల అడుగులకి మడుగులొత్తుతూ బ్రతకాల్సొస్తుందేమో అన్న భయాన్ని కలిగించకూడదు.

అయినా ఏ మాటకామాటే అనుకోవాలి. ఓ ప్రక్క అన్నయ్య పోయాడనే ఏడుస్తుందా? లేదా వీళ్ల మాటలవల్ల కలిగిన భయంతో ఇక భవిష్యత్తెలారా అనే ఏడుస్తుందా? అందుకే... నోర్మూసుకోమంట'' అంటూ అక్కడికి అవేవో భర్తే అన్నట్టుగా ఝణాయించి పారేసింది. అందుకు బదులుగా ''మరే'' అంటూ తలపంకించాడు సరళ భర్త. భార్య కోపంగా మాట్లాడుతున్నట్టు అనిపించినా, వాటిలో అంతర్గతంగా ధ్వనిస్తున్నదేదో అర్థమయ్యీ అవనట్టుగా ఉంది. ఏదిఏమైనా వదినగారి పట్ల ఉన్న అభిమానానికి అతడు ముగ్ధుడయ్యాడు.

** ** **

ఆ వేళ్టికి సరిగ్గా వర్ధని మొగుడు పోయి పదమూడు రోజులు.

అసలు విషయాన్ని పుట్టింటివారు కదుపుతారని అత్తింటివారూ, అత్తింటివారు కదుపుతారని పుట్టింటివారూ అనుకుంటూ మొత్తంమ్మీద ఎవరి మట్టుకు వారే తటస్థంగా ఊరుకున్నారు.

పైకి నోరు మెదపకపోయినా ఎంతో కొంత 'బాధ్యత తీసుకోవడానికి ఇరువైపుల వారూ సంసిద్ధంగా ఉన్నారని అందరికీ తెలుసు.

తమ్ముడు లేని లోటు తప్పించి ఉన్నంతలో మరదలునీ, పిల్లలనీ ఆదుకోవాలని మిగిలిన అన్నదమ్ములిద్దరూ ఆలోచిస్తుంటే, పిల్లదాన్ని కడుపులో పెట్టుకుని కాపాడేపాటి ఆర్థిక సదుపాయం లేకపోయినా ఏదో ఓరకంగా సాయం చెయ్యాలని పుట్టింటివారు అనుకుంటున్నారు.

''గుడ్డిలో మెల్ల ఇదీ బానే ఉంది'' అని అనుకున్నా సరళ మనస్సుకి తృప్తిగా మాత్రం అనిపించడంలేదు ఎందుచేతనో.

''కుటుంబంలో మొగుడూ, పెళ్లాలిద్దరూ పని చేస్తున్నా సరిపోని ఈ రోజుల్లో ఒక కుటుంబాన్ని పోషించడమంటే మాటలా?

తోడబుట్టిన వాడు పోయాడన్న బాధలో... ఆ ఊపులో... వేడిలో... ''మేం చూస్తాం'' అని అంటున్నా అది ఆచరణకి ఎంతవరకూ సాధ్యం?

పోనీ చూస్తారే అనుకుందాం... అలా చూసినా చేసినా ఎంతకాలమనీ? ఆ తరువాత...?''

గదిలో పెట్టె సర్దుకుంటూ పరిపరి విధాల ఆలోచిస్తున్న సరళకి ''ఊరుకోమ్మా... ఊరుకో... ఏం చేస్తాం చెప్పు. ఇంతకాలం నవ్వుతూ, తుళ్లుతూ ఉన్న మనిషి ఈ రోజుకి మన మధ్యలేకుండా పోతాడని కల్లోనైనా అనుకున్నామా? అయినా పెద్దాణ్ణి నన్నొదిలేసి చిన్నాణ్ణి పొట్టన పెట్టేసుకుందది. పోయినవాడిని ఎలాగూ తెచ్చివ్వలేను. అది నా వల్లకాని పని. వాడు లేని లోటు తప్పించి పిల్లలకే కష్టమూ రాకుండా చూసే బాధ్యత మా ఇద్దరిదీ. ఏదో క్రిందామీదాపడి నెలకింత చొప్పున పంపుతాం. తలదాచుకోవడానికి సొంత ఇళ్లు ఉండనే ఉంది. పిల్లలిద్దరూ పెద్దాళ్ళయ్యేంత వరకూ ఇల్లు మీ క్రిందే ఉంచు
కోండి'' అన్న పెద్దన్నగారి స్వరం వినబడింది.

''వదినని, ఆవిడ పుట్టింటివారిని అన్నయ్య మాటలు సాంత్వనపరచవచ్చు. కాని ''వదినగారి సమస్యకి ఇదే అంతిమ పరిష్కారమా?''

బ్రతికినంత కాలం పెళ్లాం పిల్లలకేలోటు రాకుండా రాజాలా చూసుకున్నాడు అన్నయ్య. ఇహ ఇప్పుడు వీళ్లు ఒకరి దయాధర్మాల మీద ఆధారపడి యాచకుల్లాగ బ్రతుకుతారు కామోసు? ఆ ఊహే భరించలేక ''ఛ'' అనుకుంటూ పెట్టె మూత విసురుగా వేసి, అంతకంటే విసురుగా అన్నగార్ల దగ్గరికి వెళ్ళి కూర్చుంది. కూర్చోవడంతోటే ''వదిన ఉద్యోగం చేస్తే మీకేమన్నా అభ్యంతరమా?'' చాకులా దూసుకొచ్చిన సరళ ప్రశ్నకి అక్కడున్నవారంతా రిత్తబోయారు.

''ఒర్తి అనౌచిత్యపు నోరమ్మా పిల్లదానిది'' అంటూ విసుక్కున్నారు అక్కడ పరివేష్టించిన పెద్దలంతా. చెల్లెలి ముందుచూపుకి ముచ్చటవేసినా పైకి మాత్రం ''మాకేం అభ్యంతరం. అయినా ఉద్యోగం దొరకాలి గదా. మహా మహా బియ్యేలూ, ఎమ్మేలూ చేసినవాళ్లే ఖాళీగా కూర్చుంటే ఇంటరు కూడా చదవని మీ వదినకి ఎవరు ఉద్యోగం ఇస్తారమ్మా?'' అంటూ పెదవి విరుస్తున్న అన్నగారిని వారిస్తూ, ఎందుకు దొరకదు. అన్నయ్య చేసింది గవర్నమెంటువారి ఆఫీసులో కాబట్టి దొరికి తీరాలి. ఎందుకంటే ఉద్యోగం చేస్తుండగా పోయాడు కాబట్టి, ఆయన తరువాత తన కుటుంబ సభ్యులెవరికైనా ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి రూల్స్ ప్రకారం. అంచేతవదినెందుకు ప్రయత్నించకూడదు?'' ఆ ప్రశ్నలో 'ప్రయత్నించాలి' అన్న సూచన ఉంది.


అన్నయ్యది ఆఫీసరు గ్రేడు. ఈవిడ చూడబోతే టెన్త్. టైపు లోయరు ఉందనుకో. ప్రయత్నిస్తే టైపిస్టు పోస్టు దొరక్కపోదు. చిన్నపిల్లలతో ఎలా వెడుతుంది? అథమా వెళ్లినా స్కేలేమంత బావుంటుందని...?'' సాలోచనగా అన్నాడు పెద్దన్నగారు.

అన్నగారి అనుమానాలని కొట్టిపారేస్తూ ''పిల్లలకేం ఉందిలే అంతగా అయితే వాళ్లమ్మగారు వదిన దగ్గరకొచ్చి ఉండిపోతే సరి'' అని అంటున్న సరళ మాటలకి మధ్యలోనే అడ్డుతగులుతూ ''ఇలాటప్పుడు దాని మనసు ఉద్యోగం మీదేం ఉంటుంది? అయినా అది ఉద్యోగం చేసినా చెయ్యకపోయినా

## కనిపించట్లేదు

సుబ్బారావు: డాక్టర్... ఈ మధ్య నాకు కళ్ళు సరిగా కన్పించడంలేదు. కళ్ళజోడు అవసరమంటారా?
మాంసం వ్యాపారి: తప్పకుండా అవసరమండీ.. ఇప్పుడు మీరొచ్చింది డాక్టర్ దగ్గరకు కాదు. మాంసం అంగడికి.

చంద్రశేఖర్,
సూళ్ళూరుపేట.



మగదిక్కు లేని కొంపయ్యిందా. అదా వయసులో ఉన్న పిల్ల. ఒంటరిగా ఎలా వదిలేస్తాం చెప్పు. ఇహ ఈ ఘటం ఈ ఇంట్లోనే. అయినా చిన్న పిల్లవి నీకు తెలీదు. ఇలాంటి కష్టాలొచ్చినప్పుడు మిగిలిన పెద్దవాళ్లంతా కలిసి ఆ కుటుంబాన్ని ఆదుకోవడంలో రివాజు. అయినా 'చూడం' అంటే తప్పుకానీ చూస్తామంటే తప్పుకాదే. అంచేత సమస్య ఏమీ లేనేలేదు. నీ కడుపు చల్లగా ఉండా... మాట్లాడక ఊరుకోమ్మా పుణ్యమంటుందీ'' అంటూ ముక్తాయించింది వర్థని తల్లి.

''సమస్య లేదంటే నేనొప్పుకోను. మీరు చూస్తున్న పరిష్కారం తాత్కాలికం. నేను చెప్తున్నది శాశ్వతం. అంచేత తెలివైన వారెవరైనా నా అభిప్రాయమే సరైనదంటారు. మరో ముఖ్య విషయం ఏమిటంటే ఇలాంటప్పుడు మనసు పెట్టి కాకుండా బుర్ర పెట్టి ఆలోచించాలి. అది మీరు చెయ్యలేరు. వర్థని మీకు కూతురైతే మా అన్నగారి పిల్లలకి తల్లి. అంచేత మీరు మాట్లాడక ఊరుకోండి'' అని ఖరాఖండీగా తేల్చివేసింది సరళ.

ప్రేక్షక మాత్రంగా ఉండిపోయిన రెండో అన్నగారిని ఉద్దేశిస్తూ ''చిన్నదో పెద్దదో ఒక ఉద్యోగం అంటూ చేస్తే నెల తిరిగేసరికి నికరాదాయం ఉంటుంది. దాంట్లోనే సర్దుకోవాలి. ఎందుకంటే, ఎదుటివారి కష్టంతో పెరుగూ అన్నం పెట్టేకంటే తనకష్టంతో మజ్జిగా అన్నం పెట్టినా ఆనిందుదవమే వేరు. కలిగే తృప్తే వేరు. కొద్దోగొప్పో నిలద్రొక్కుకునే వరకూ మీ సాయాన్ని తీసుకున్నా అదో పద్ధతి. అలా కాకుండా జీవితాంతం పావలాకీ, పరక్కీ మీమీద ఆధారపడటం ఎదిగే పిల్లల మనసులకి ఏమంత మంచిదికాదు. ఎందుకంటే సహాయాన్ని అందుకోవడంవేరు, పూర్తిగా ఆధారపడిపోవడం వేరు. ఇలాంటి వాతావరణంలో పెరిగిన పిల్లలు రేపు ఎదుటివాడి కష్టాన్ని జలగల్లా పీక్కు తినరని ఏమిటి గ్యారంటీ?'' సరళ ప్రశ్నకి ఎవరూ సమాధానం చెప్పలేదుగానీ, వాళ్ల మొహాలు చూస్తే ఏమనిపించిందో ''నిజం నిష్ఠూరంగానే ఉంటుంది'' అనేసింది తనే. మళ్లీ అందిగదా ''మనిషికి సుఖాలకంటే కూడా వ్యక్తిత్వ పోషణ అవసరం. అలాగే డబ్బుకంటే కూడా అభిమానం ముఖ్యం'' అన్న సరళకి సమాధానం చెప్తున్నట్లుగా ''తలచెడిన ఆడది అభిమానాలకి పోతే ఎలా గడుస్తుందీ'' అంటూ లాపాయింటు లేవనెత్తింది వర్థని తల్లి.

ఆమాత్రంగా అనేసి ఊరుకోవడానికి ఆవిడ తల్లి మనసు ఒప్పలేదు. ''అంతేనమ్మా! పురుళ్లకీ, పుణ్యాలకీ వదినగారు ఎంతచేసినా తన బుద్ధి మాత్రం పోనిచ్చుకుంది కాదు. చూశారా... కష్టంలో ఉన్న వదినగారిని పెద్దమనసుతో అన్నగార్లు ఆదుకుంటున్నారే అని సంతోషించక అడ్డుపుల్ల ఎలా వేసిందో చూశారా?'' అంటూ నివ్వెరపోయింది.

ఆవిడ తాలూకు బహిరంగ నివ్వెరపాటుకి ''కాదూ మరి'' అని బుగ్గలు నొక్కుకుంటూ ఆడంగులంతా కలిసి ఎడాపెడా వత్తాసిచ్చారు.

ఇంత తంతుకీ కారకురాలైన వర్థని బాహ్య ప్రపంచంతో సంబంధం లేని దానికిమల్లే కూర్చొని ఉంది. మౌనం చాలా పదునైందిసుమా అనుకున్న సరళకి నిజానికి ''నీకేం భయం లేదు మేం ఉన్నాం'' అంటూ ధైర్యం చెప్పిన అన్నయ్యల ఔదార్యానికి చాలా గర్వంగానే ఉంది. అయితే ఒకరి ఔదార్యంమీద ముగ్గురి జీవితాలు ఎలా వెళ్లమారుతాయన్నదే సందేహమంతా.

అసలలా ఎందుకు వెళ్లమారాలన్నదే సరళని తొలిచేస్తున్న ప్రశ్న. అందుకనే ఊరుకెళ్లే ముందు ''స్త్రీ బుద్ధిః ప్రళయాంతకా'' అన్న అపవాదుని నెత్తినేసుకుని మరీ వస్తున్న భార్యని చూస్తే జాలిగా అనిపించిందో క్షణం సరళ భర్తకి.

మరుక్షణం—

మంచితనం వేరు.

మంచివాళ్లని నలుగురి చేతా అనిపించుకోవడం వేరు.

తనతో ఎన్నేళ్లు కాపరం చేసినా, ఆ పాటి లౌక్యాన్ని అలవరచుకోలేని భార్య చేతగానితనంపై మా చెడ్డకోపం వచ్చింది సరళ భర్తకి.

## అంకితం:

మానవ సంబంధాలన్నీ డబ్బు సంబంధాలుగానే
పరిణమిస్తున్న దశలో
ఏ ఒకరిద్దరి గుండె చప్పుళ్లను సైతం వినే ఉత్సాహం,
తీరిక, ఆసక్తిలేని వ్యాపార నాగరికతలో
మెదళ్లతో తప్పితే మనసులతో ఆలోచించలేని
స్నేహరాహిత్య ప్రపంచంలో
మనసున్న మంచి మనిషిగా,
గడదాకా
మా స్మృతుల కవాటాల్లో సజీవుడై
రష్యన్ కొలాబరేషన్‌తో రూపుదిద్దుకున్న
మొట్టమొదటి భారతీయ సబ్‌మెరైన్‌లో
సీనియర్ సైంటిస్ట్‌గా పనిచేస్తూ,
అధికారుల నిర్లక్ష్యం వల్ల
'లుకేమియా'కి బలైపోయిన
'రవి'కి
మా స్నేహ బృందం తరపున
ఈ కథ అంకితం.

-రమా నరసింహం కాశీవఝల


ఈ తరం రచయిత
సూర్యదేవర
రామ్మోహన్‌రావు
'సౌందర్య' ప్రపంచంపై
ఎక్కుపెడుతున్న నవలా
సమ్మోహనాస్త్రం
జనవరి 5
తరువాత
ఉదయం
డెయిలీ సీరియల్